సొంతూళ్లో .. ఇంటిలిపాది ఆత్మీయత, అనురాగం పంచుకుని.. దసరా సంబర అనుభూతిని మరువక ముందే.. 13 మంది వలస కూలీలను విధి కాటేసింది. పొగ మంచు రూపంలో జాతీయ రహదారిపై మాటు వేసిన మృత్యువు అనూహ్యంగా.. అకస్మాత్తుగా మింగేసింది. వీరిలో ముగ్గురు మహిళలు, ఓ ఆరేళ్ల బాలుడు ఉన్నారు. నిండూ నూరేళ్ల దాంపత్యంపై ఆశతో వైవాహిక జీవితంలో అడుగు పెట్టిన నవ దంపతుల ప్రాణాలూ గాలిలో కలిసిపోగా... శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని పలు పల్లెల్లో .. కన్నీటి కెరటాలు ఉప్పొంగాయి. అందరూ కష్ట జీవులే.. ఏ రోజుకు ఆరోజు కూలి పని వెళ్తేగానీ ఆకలి తీరదు. కానీ.. కాయకష్టంలో పైసా పైసా కూడబెట్టుకుని.. పండక్కో పబ్బానికో సొంతూరుకు చేరుకుని... అందరినీ కలిసి, బాగోగులు పంచుకుని.. మళ్ళీ కూలి పనికి బయలుదేరిన కుటుంబాలపై మృత్యువు విరుచుకు పడింది. ఇలా వచ్చి .. ఆలా భౌతికంగా దూరమైన తమ ఆత్మీయులను కోల్పోయిన జనం కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు.

# కన్నీళ్లకే కన్నీళ్లు

## పొగు మంచు మాటులో మృత్యువు కాటు

- అందరూ పేదోళ్లే
- పది కుటుంబాల్లో విషాధం
- ముగిసిన నవదంపతుల కథ
- తల్లి కళ్ల ఎదుటే ఆగిన చిన్నారి ఊపిరి
- సిమెంట్ లారీని ఢీకొన్న సుమో
- 13 మంది దుర్మరణం



శ్రీ సత్య సాయి జిల్లాలోని వివిధ ప్రాంతాలలకు చెందిన సుమారు 10 కుటుంబాలు కర్ణాటకలోని బెంగళూరు, పరిసర ప్రాంతాలలో కూలి పనులు, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తెలుగునేలలో ప్రధాన పండుగ దసరా వేడుకలకు .. తమ సొంతూళ్లలో కుటుంబ సభ్యులతో, బంధుమిత్రులతో, స్నేహితులతో గడిపి చక్కటి అనుభూతులను తలచుకుంటూ గురువారం ఉదయం గోరంట్ల నుంచి బెంగళూరుకు తిరుగు పయనమయ్యారు. ఆ ప్రయాణమే ఆఖరి ప్రయాణంగా మారుతుందని ఏమాత్రం ఊహించి ఉండరు. పొగ మంచుతో రోడ్డు సరిగా కనిపించలేదు. వేగం తగ్గించి వాహనాన్ని నడపాల్సిందే. కానీ అందుకు విరుద్ధంగా వేగంగా వెళ్లి రోడ్డుపై ఆగిన సిమెంటు లారీని ఢీకొనడంతో ఇంత ఘోర దుర్ఘటనకు దారితీసింది.. ఎన్నో ఆశలతో



తమ వైవాహిక జీవితాన్ని ఊహించుకుంటూ ఒకటైన నవ దంపతులకు ఈ దుర్ఘటన కేవలం ఒకరోజు తోనే సమాప్తం కావడం బాధాకరం. నిండు నూరేళ్లు బతకాల్సిన చిన్నారి బాలుడు ఆరేళ్లకే అసువులు బాసిన ఘటనతో కన్నీళ్లకే కన్నీళ్లు తప్పవు. మృతుల వివరాలు ఇవి.. పవన్ కుమార్ (కొత్తచెరువు) సుబ్బమ్మ, కామాక్షి (బెంగళూరు) నరసింహమూర్తి మారగాని కుంట ( బాగేపల్లి) అరుణ (దొడ్డబల్లాపూర్), ఆరేళ్ల బాలుడు, నరసింహప్ప (డ్రైవర్ కలగిరి , గోరంట్ల మండలం) మృతుల్లో ఇద్దరు ఓడి చెరువు నవాబు కోటకు చెందిన



నవ దంపతులు, ఇంకా కొంతమంది వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిక్బల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కర్ణాటక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కంట్రోల్ చేయండి

- వాళ్లంతా కేసీఆర్‌కు ఆర్మీలా పనిచేస్తున్నారు..
- ఈసీకి కంప్లైంట్ చేసిన కాంగ్రెస్ నేతలు
- ఎన్నికల నియామావళి ఉల్లంఘిస్తున్నారు
- డీజీపీ అంజనీకుమార్, సీనియర్ ఐపీఎస్ స్టీఫెన్‌ని బదిలీ చేయాలి
- సీఎంవోలో స్మితా సబర్వాల్‌ని కూడా ట్రాన్స్‌ఫర్ చేయాలి
- ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్‌తో ఎలక్షన్ ఫండ్ రైజింగ్ జరుగుతోంది
- రిటైర్డ్ అధికారులు ప్రైవేటు ఆర్మీలా వ్యవహరిస్తున్నారు
- ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రేవంత్, ఉత్తమ్



ఎన్నికల నియామావళిని బీఆర్ఎస్ ఉల్లంఘిస్తుందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ విషయమై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టుగా కాంగ్రెస్ నేతలు చెప్పారు. గురువారం టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పార్టీ నేతలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ కు మద్దతిస్తున్న అధికారులకు ఎన్నికల విధులు అప్పగించవద్దని కోరినట్టుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. ప్రభుత్వ పథకాల్లో ఇచ్చే డబ్బు ఎన్నికల నోటిఫికేషన్ కు ముందే ఇవ్వాలన్నారు. అధికారిక భవనాల్లో రాజకీయ కార్యకలాపాలు జరగకుండా చూడాలని ఈసీని కోరినట్టుగా ఉత్తమ్ చెప్పారు.

### ప్రైవేటు ఆర్మీలా రిటైర్డ్ అధికారులు..

కిషన్ రావు, ప్రభాకర్ రావు , జగన్మోహన్ రావు వంటి రిటైర్డ్ అధికారులను విధుల నుండి తప్పించాలని ఈసీని కోరినట్టుగా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ మేరకు తాము ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు. జయేష్ రంజన్ లాంటి అధికారులు బీఆర్ఎస్ కు ఎన్నికల నిధులు ఇవ్వాలని వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. పార్టీ ఫండ్ ఇచ్చే కాంట్రాక్టర్లకు మాత్రమే నిధులు విడుదల చేస్తున్నారని రేవంత్ ఆరోపించారు. రిటైర్డ్ అధికారులు ప్రైవేట్ ఆర్మీలా వ్యవహరిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు ఆపేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని తమపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తుందన్నారు.

### డీజీపీ అంజనీకుమర్‌ను బదిలీ చేయాలి..

తెలంగాణ డీజీపీ అంజనీకుమార్, మరో ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్రను బదిలీ చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సీఎంవోలో పనిచేసే స్మితా సభర్వాల్, రాజశేఖర్ రెడ్డి బీఆర్ఎస్ కు అనుకూలంగా పనిచేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదు బదిలీని ఈ ఏడాది నవంబర్ 2 లోపుగా పూర్తి చేయాలని ఈసీని కోరామన్నారు. నవంబర్ 3 నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నందున అంతకుముందే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కోరామన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులకు ఎన్నికల విధులు కేటాయించాలని రేవంత్ రెడ్డి కోరారు. ప్రభుత్వ వేతనాలతో ప్రైవేట్ ఆర్మీని కేసీఆర్ నియమించుకున్నారని విమర్శించారు. కొత్త ఆర్మీతో కాంగ్రెస్ నేతలపై కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు.

### అధికారంలోకి రాగానే అన్నీ తెస్తాం..

ఎన్నికల కారణంగా ప్రస్తుతం ఏది వాయిదా పడినా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తిరిగి తీసుకొస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు సంఘవిద్రోహ శక్తుల కుట్రగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక తప్పును కప్పిపుచ్చుకొనేందుకు మరో తప్పు చేస్తున్నారన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు కారణాలు ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. ఈ బ్యారేజీ నిర్మించిన నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మీనమేషాలు లెక్క పెడుతుందని ప్రశ్నించారు.

# భలే మంచి ఛాన్స్ లే..

**• దొరికినంతా మేసేద్దాం**

- చోటా మోటా నేతల విన్యాసాలు
- పూటకో పాట.. రోజుకో పల్లవి
- రికార్డు రేట్లు.. అభ్యర్థుల పాట్లు
- భార్యాభర్తలు సెపరేటు..
- అలక తీరిస్తేనే ఓటు
- మధ్యవర్తులకు ఇంకో రేటు
- పెద్దమనుషుల ఒప్పందాలకు చోటు!




హైదరాబాద్, ఆంధ్రప్రభ: దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టు కుందాం... వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుందాం... నైతిక విలువలంటూ కూర్చుంటే నష్టపోవడమే... అందింది పుచ్చుకుందాం... గోడ దూకేద్దాం! ...ఇదీ ప్రస్తుతం ఎన్నికల రణక్షేత్రంలో గ్రామ, వార్డు స్థాయి నేతల తీరు! ఎంపీటీసీ, జెడ్పీటీసీలు కూడా వీరికి అతీతం కాదు! ఇది ఏ తీరులో ఉందంటే ఉదయం ఒకటి, మధ్యాహ్నం మరొకటి, సాయంత్రానికి ఇంకొక కండువాను కప్పుకునేందుకు ఏమాత్రం సిగ్గు పడడం లేదు. దీంతో విస్తు పోవడం ఆయా పార్టీల వంతు అవుతోంది. ఊసరవెల్లులకే పాఠాలు నేర్పుతున్న వీరి వ్యవహారం తలనొప్పిగా మారడమే కాకుండా వాస్తవ పరిస్థితి ఏంటో కూడా తెలియని అయోమయంలో అభ్యర్థులు, నేతలు ఉన్నారు. ఎన్నికల వేడి పెరగడంతో నియోజక వర్గాల్లో చోటా నాయకుల ప్రాధాన్యం అమాంతం పెరిగి పోయింది. దేశ ఎన్నికల చరిత్రలోనే లేనివిధంగా ఆల్‌టైమ్ రికార్డు స్థాయిలో లక్ష్మీ తాండవిస్తోంది! కొత్తగా పెళ్లయిన అల్లుడు అలకపాన్పు ఎక్కినట్టు తరతమ బేధం లేకుండా అందరిదీ ఒక్కటే డిమాండ్! తమ పార్టీ కింది స్థాయి నేతలే అసమ్మతి రాగాలు తీవ్రస్థాయిలో ఆలపిస్తుండడం పార్టీలను నివ్వెరపరుస్తోంది. గంట గంటకూ, రోజు రోజుకూ వీరి పాట ఆలపన పెరిగిపోతోంది! పైగా కొత్త డిమాండ్లు పుట్టుకొస్తున్నాయి...

ఈసారి అసెంబ్లి ఎన్నికల హోరు తీవ్రస్థాయిలో ఉంటుందని ఇప్పటికే వెలువడుతున్న వేడి చెప్పకనే చెబుతోంది. ఆయా నియోజకవర్గాల్లో ఏ అభ్యర్థి గెలిచినా మెజారిటీ తక్కువ స్థాయిలోనే ఉంటుందని విశ్లేషకుల అంచనా! దీంతో పోలింగ్ మేనేజ్‌మెంట్ ప్రాధాన్యం పెరిగింది. ఒక్క ఓటును కూడా నిర్లక్ష్యం చేయలేని పరిస్థితి! ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు స్థాయి నేతలకు ఎక్కడలేని ఇంపార్టెన్స్ వచ్చింది. అన్నీ పార్టీలు ఆయా చోటా మోటా నేతల చుట్టూ ప్రదక్షిణలు చేయడం అనివార్యంగా మారింది.

భానుడి కంటే ముందుగానే ఆయా పార్టీల నియోజకవర్గ స్థాయి నేతలు తలుపుతడుతున్నారు! దీంతో ప్రత్యర్థి పార్టీ గ్రామ, వార్డు స్థాయి నేతలతో పాటు సొంత పార్టీ నేతలను కూడా సవరదీసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు! తీరా వారిని సంతృప్తి పరిచినా ఆసాంతం తమ వెంట ఉంటారని నమ్మలేకుండా ఉన్నామని వారు గగ్గోలు పెడుతున్నారు. ఎందుకంటే పొద్దున్న తమతో మాట్లాడి ఓకే చెప్పిన వాళ్లే మధ్యాహ్నం మరో పార్టీ నేతలతో కనిపిస్తున్నారు! ఇలా పూటకో పల్లవి అందుకుంటుంటే ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో అభ్యర్థులు పడిపోతున్నారు!

ఈ పరిస్థితి ఇలా ఉంటే వీళ్లందరినీ సరి చేయడానికి కొందరు మధ్యవర్తులకు కూడా డిమాండ్ ఏర్పడింది! వాళ్లను ముందుగా మంచి చేసుకుని ఆ తర్వాత ఈ చోటా మోటా నాయకులను కలిసి డిమాండ్లను తీరుస్తున్నారు. అంతేకాదండోయ్... మళ్లీd పార్టీ మారితే ఇచ్చిన బహుమతులన్నీ తిరిగి ఇచ్చేయాలన్న పెద్దమనుషుల ఒప్పందాలను కుదుర్చుకుంటున్నారు. ఇదే ఈ ఎపిసోడ్‌లో హైలైట్! ఇక భార్యాభర్తలను కూడా విడివిడిగా సంప్రదించి డిమాండ్లు తీర్చాల్సి రావడం కొసమెరుపు! ఎందుకంటే భార్య సర్పంచ్‌గా ఉంటే భర్తను, భర్త సర్పంచ్‌గా ఉంటే భార్యతోనూ మాట్లాడి సంతృప్తికర ఒప్పందాలను కుదుర్చుకుంటున్నారు! వార్డు మెంబర్, మాజీ మెంబర్‌లకు కూడా ఏమాత్రం తగ్గేదేలే అని విశ్వరూపం చూపించి అభ్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారు!




# ఎమ్మెల్సీ కూచుకుల్ల పార్టీకి రాజీనామా

పాలమూరు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి బీఆర్ఎస్‌కు గట్టి షాక్ ఇచ్చారు. ఆ పార్టీని వీడుతున్నట్లు చెప్పారు. అంతేకాదు.. ఆయన కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి తన రాజీనామా పత్రాన్ని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌కు పంపారు. తనకు బీఆర్ఎస్‌లో తగినంత ప్రాధాన్యత ఇచ్చిన్నటికీ స్థానికుల ఇబ్బందులను సీఎం కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదని అన్నారు. అందుకే తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తాను పంపుతున్న రాజీనామాను అంగీకరిస్తారని భావిస్తున్నానని లేఖలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఈనెల 31న పాలమూరు ప్రజాభేరిలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ప్రియాంక గాంధీ సమక్షంలో దామోదర్‌రెడ్డికాంగ్రెస్‌తీర్థం పుచ్చుకోనున్నట్టు సమాచారం..




### అక్టోబర్ 29న
# పాక్షిక చంద్రగ్రహణం

- 8 గంటల పాటు

**శ్రీవారి ఆలయ తలుపులు మూత**



అక్టోబర్ 29వ తేదీన పాక్షిక చంద్రగ్రహణం కారణంగా అక్టోబర్ 28న రాత్రి 7.05 గంటలకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేసి అక్టోబరు 29వ తేదీన తెల్లవారు జామున 3.15 గంటలకు తెరుస్తారు. దాదాపు 8 గంటల పాటు ఆలయ తలుపులు మూసి ఉంటాయి. అక్టోబర్ 29 తెల్లవారుజామున 1.05 నుండి 2.22 గంటల మధ్య పాక్షిక చంద్రగ్రహణం పూర్తవుతుంది. ఈ కారణంగా తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని అక్టోబరు 28న సాయంత్రం 6 గంటలకు మూసివేసి.. అక్టోబరు 29న ఉదయం 9 గంటలకు తెరుస్తారు. ఈ సమయంలో అన్నప్రసాదాల పంపిణీ ఉండదు. అదేవిధంగా, అక్టోబర్ 28న సహస్రదీపాలంకారసేవను, వికలాంగులు, వయోవృద్ధుల దర్శనాన్ని టీటీడీ రద్దుచేసింది. భక్తులు ఈ విషయాలను గమనించి అసౌకర్యానికి గురికాకుండా తిరుమల యాత్రకు ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులు తెలిపారు.